ప్రజాశక్తి
గురువారం 27 జూన్ 2024
5
శ్రీ సత్యసాయి

టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతలో 62.36 - శ్రీసత్యసాయిలో 68.93 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌ఎస్‌సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి విడుదల అయ్యాయి. మే24 నుంచి జూన్ 10వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఇందుకు సంబంధించి అనంతపురం జిల్లాలో 7785 మంది పరీక్షలు రాయగా 4854 ఉత్తీర్ణత సాధించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 4934 మంది పరీక్షలు రాయగా 3407 మంది ఉతీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లా కంటే సత్యసాయి జిల్లా 5.43 శాతం ఉత్తీర్ణత పెరిగింది. జిల్లాల వారీగా చూస్తే అనంతపురం 62.36 శాతం, శ్రీ సత్యసాయి జిల్లా 68.93 శాతం ఉతీర్ణత సాధించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా బాలురు 60.42, బాలికలు 64.54 శాతం ఉత్తీర్ణతతో పాస్ అయ్యారు.

సీజనల్ వ్యాధుల విజృంభన

- చాపకింద నీరులా వ్యాపిస్తున్న డయేరియా
- పెరిగిన దోమలు... విస్తరిస్తున్న జ్వరాలు..!
- భయాందోళనలో జనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వర్షాకాలం మొదలవడంతో సీజనల్ జబ్బులు భయపెడుతున్నాయి. ఒకవైపు డయేరియా చాపకింద నీరులా విజృంభిస్తుండగా, జ్వరాలు కూడా అదే స్థాయిలో కలవర పెడుతున్నాయి. ఈ ఏడాది ఎప్పుడూలేనంతగా జూన్ నెలలో వర్షాలు పడ్డాయి. సాధారణం కంటే 170 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. గుంతలు, చిన్న కుంటల్లోకి నీరు చేరడడంతో దోమల బెడద సైతం పెరిగింది. దీంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. అంటు వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా ఉన్నత స్థాయి అధికారులు వైద్యఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.

పామిడిలో ఇద్దరు మృతి ..

డయేరియా (అతిసార) జిల్లాలో విజృంభిస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. సోమవారం వరకు 16 మంది బాధితులుండగా రెండు రోజుల్లో ఈ సంఖ్య 60కిపైగా పెరిగింది. అదే విధంగా పామిడి మండలం రామగిరి ఎగువతాండలో ఇప్పటికే ఇద్దరు దీని బారినపడి మృత్యువాతపడ్డారు. వారం రోజుల క్రితం పెద్దమ్మ(60) అనే మహిళా మృతి చెందింది. మంగళవారం నాడు రేణుక (22) మృతి చెందారు. ఈ రకంగా క్రమక్రమంగా డయేరియా బాధితులు సంఖ్య పెరుగుతోంది. గుత్తిలోని గురుకులంలోనూ విద్యార్థులు డయేరియా బారిన పడ్డారు. నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ ఇటీవలే మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇది విస్తరించకుండా ఉండే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

విస్తరిస్తున్న జ్వరాలు

వర్షాలు పడి నీరు కుంటల్లోకి, లోతట్టు ప్రాంతాల్లోకి చేరడంతో దోమల బెడద పెరిగింది. దీని వల్ల జ్వరాలు విస్తరిస్తున్నాయి. మలేరియాతోపాటు కామెర్లు సైతం వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో బాధితులు బారులు దీరుతున్నారు. జ్వర పీడితులతో కిటకిట లాడుతున్నాయి. సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నా ఇవి ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. దోమల నివారణకు ఎక్కడా ఫాగింగ్ జరుగుతున్న దాఖలాల్లేవు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మురుగునీరు నిలువున్న ప్రాంతాల్లో దోమల నివారణకు అవసరమైన పిచికారి కూడా లేదన్న విమర్శలున్నాయి.

రజాపురం గురుకుల పాఠశాలలో డయేరియా సోకిన విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

రజాపురం బాలికల గురుకుల పాఠశాలలో డయేరియా

గుత్తి : అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని రజాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు డయేరియా సోకింది. బుధవారం నాడు ఏకంగా పాఠశాలలోని 17 మంది విద్యార్థులు డయేరియా లక్షణాలతో వాంతులు, విరోచనాలకు గురయ్యారు. స్పందించిన గురుకుల పాఠశాల సిబ్బంది విషయాన్ని వైద్య ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. వెంటనే వైద్య సిబ్బంది గురుకుల పాఠశాలకు చేరుకుని అక్కడే విద్యార్థినులకు వైద్య చికిత్సలు అందించారు. డయేరియా సమాచారం తెలుసుకున్న ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, తహశీల్దార్ బి.భారతి, ఎంపీడీవో శ్రీనివాసులు, బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌లు గురుకుల పాఠశాలను సందర్శించారు. డయేరియా వ్యాపించడానికి గల కారణాలను ఆరా తీశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కాగా డయేరియా సోకడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు విద్యార్థినులు వాళ్ల ఊర్లలోనే అతిసారకు గురయ్యి పాఠశాలకు వచ్చారని, తల్లిదండ్రులు పిలిపించి విద్యార్థులను వారి స్వగ్రామాలకు పంపించామని పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ప్రస్తుతం 17 మంది విద్యార్థులకు పాఠశాలలోనే చికిత్స అందిస్తున్నామని, వారికి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

నిర్వాసితులకు నష్టపరిహారం

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందజేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు కలెక్టరేట్‌లో భూ సేకరణ, రైల్వే పనులకు సంబంధించి రైతులకు పరిహారంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నేషనల్ హైవే అధికారి గిడ్డయ్య, ఆర్డీవోలు వెంకట శివ సాయి రెడ్డి, భాగ్యరేఖ, ఏపీఐఐసీ అధికారి సహిన సోనీ సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణ కోసం బి.కొత్తపల్లి, గోరంట్లలో భూ సేకరణ జరిగిందన్నారు. నష్టపరిహారం చెల్లింపుల కోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 11.04 కోట్లు పరిహారం పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి నాలుగు లైన్ల విస్తరణ, పుట్టపర్తి నుంచి కోడూరు వరకు భూములు నష్టపోయిన నిర్వాసితులకు పరిహారం అందించనున్నట్లు చెప్పారు. బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల, పెనుకొండ డివిజన్‌లో చిలమత్తూరు మండలాల్లోని రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రతివారం పరిహారం పంపిణీపై ప్రత్యేక సమీక్ష జరుగుతుందన్నారు. కోర్టుల్లో ఉన్న కేసులకు కౌంటర్ వేయాలన్నారు. ఆయా మండలాల పరిధిలోని అధికారులు పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

మాట్లాడుతున్న ఎడిజె కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో మత్తు పదార్థాల నిషేధంపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కావడం వల్ల అటు ఆరోగ్యంతో పాటు ఇటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోంటారన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారి లక్ష్యాలను సాధించేందుకు, సమాజాభివద్ధికి యువత కషి చేయాలన్నారు. చదువులో రాణిస్తూ సమాజాభివద్ధిలో భాగస్వామ్యులు కావాల్సిన అవసరం ఉందన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందు కెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి కళాశాలల ప్రిన్సిపాల్స్ నారాయణరెడ్డి, శివ శంకర్ రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు సుదర్శన్, సంతోషికుమారి పాల్గొన్నారు.

పెనుకొండ అభివృద్ధే ధ్యేయంగా పని చేద్దాం

- కక్షసాధింపు రాజకీయాలు వద్దు
- బీసీ సంక్షేమ,చేనేత,జౌళి శాఖా మంత్రి సవిత

కాంప్యాక్ట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండ అభివృద్ధే ధ్యేయంగా పని చేద్దామని, కక్షసాధింపు రాజకీయాలు వద్దు అంటూ రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి సవిత తెలియజేశారు. నగర పంచాయతీలో చెత్తసేకరణ చేసే కాంప్యాక్ట్ వాహనాన్ని బుధవారం నాడు మంత్రి నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుకొండలో గతంలో జరగని విధంగా అభివృద్ధి పనులు జరగబోతున్నాయన్నారు. అందులో భాగంగా రూ.47 లక్షల వ్యయంతో చెత్త సేకరణ కోసం కాంప్యాక్ట్ వాహనం, రూ.20 లక్షల వ్యయంతో చెత్త డంపు చేసే గ్యాబేజీలు పట్టణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెనుకొండ ప్రజలు తనపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేసి చూపుతానన్నారు. కౌన్సిలర్లు అందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. రాజకీయలు ఎన్నికల వరకూ మాత్రమే చూడాలని మంత్రి పేర్కొన్నారు. అందరం కలసి కట్టుగా పని చేసి పెనుకొండను అభివృద్ధి పథంలో నడపుదాం అని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఫించను రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచి, ఎప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించిన రూ.3 వేలతో కలిపి ఒకటో తేదీన రూ.7 వేలను ఫించన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణి చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్‌ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్ కుమార్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కౌన్సిలర్లు రామాంజినేయులు, తయ్యబ్, గిరి, గణేష్, బాబు, శ్రీరాములు, సద్దాం, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు, తెలుగుదేశం నాయకులు తివేంద్ర, బాబుల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు దాదు, సిద్దయ్య పాల్గొన్నారు.

కాంప్యాక్ట్ వాహనాన్ని స్వయంగా నడుతపున్న మంత్రి సవిత

'డ్రగ్స్'తో జీవితాలు నాశనం

- పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మాదకద్రవ్యాలను సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు..
- ఎస్‌పి మాధవ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

డ్రగ్స్ తీసుకోవడం ద్వారా జీవితాలు నాశనం అవుతాయని, యువత ఇలాంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పి మాధవ్ రెడ్డి తెలియజేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హిందూపురంలో నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. చిన్న మార్కెట్ నుంచి ప్రారంభం అయిన ర్యాలీ పట్టణ పుర వీధుల గుండా అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. అంబేద్కర్ సర్కిల్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. చిన్నచిన్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని తెలిపారు. డ్రగ్స్ వాడడం వల్ల, మైండ్‌తో పాటు, ఆలోచించే శక్తిని కోల్పోతారన్నారు. సామాజిక, మానసిక, శారీరక అనారోగ్య సమస్యలు పెరిగి ప్రాణాంతక వ్యాధులుగా మారుతాయన్నారు. కొంత మంది డ్రగ్స్‌కు అలవాటు పడి డబ్బుల కోసం నేరప్రవృత్తి వైపు కూడా మళ్లుతున్నారని చెప్పారు. జీవితంపై ఇంతట చెడును కల్పించే డ్రగ్స్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌ను విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంశాఖ మంత్రి వనిత డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలన్న సంకల్పంతో ఉన్నారని, అందుకోసం ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తెలియజేశారు. సమీప ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలిపాలన్నారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎఎస్‌పి నాగభూషణం, సెబ్ ఎఇఎస్ సుబ్రహ్మణ్యం, పెనుగొండ డీఎస్పీ బాజీ జాన్‌సైదా, సిఐలు శ్రీనివాసులు, రియాజ్ అహ్మద్, శ్రీనివాసులు, ఎస్‌ఐలు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి మాధవ రెడ్డి

1 నుంచి సమ్మెలోకి వెళ్తాం

ప్రజాశక్తి - పరిగి

గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు పది నెలల నుండి వేతనాలు ఇవ్వలేదని లేదని వారి సమస్యల పరిష్కారానికి జూలై 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నారని సిఐటియు డివిజన్ నాయకులు రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పరిగి మండల కేంద్రంలోని సచివాలయంలో గౌస్ మహమ్మద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికులకు నెలనెలా అందించే మౌలిక వసతులతో పాటు పూర్తిస్థాయి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జులై 1 నుండి సమ్మెలోకి వెళ్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సజ్జరాయప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, మూర్తప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలో ఐదుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. ఈ మేరకు వారు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలోకి చేరారు. ఈసందర్భంగా వారికి టిడిపి కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.

పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, తదితరులు

వైద్యసిబ్బందిపై వేధింపులు జరుగుతున్నా పట్టించుకోరా..?

ఆశ వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని వైద్యసిబ్బందిపై జరుగుతున్న వేధింపులపై వైద్యశాఖ స్పందించడం లేదని ఆశ వర్కర్ల జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబశివ విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రతి రోజు ఏదో ఒక సంఘటన జరుగుతోందనికనీసం వెలుగులోకి వచ్చిన వాటిని సైతం వైద్య శాఖ అధికారులు పరిష్కరించకుండా నిద్రమత్తులో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగసముద్రం గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఉదయ్ వ్యవహార శైలిపై పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ఫలితం లేదని ఆయన వాపోయారు. ప్రతిరోజు నాగసముద్రం గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్ అక్కడ పనిచేస్తున్న నర్సులతో అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. అంతటితో ఆగకుండా వాట్సాప్ ద్వారా వారికి, వారి కుటుంబ సభ్యులకు మెసేజులు పంపుతున్నారని అన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విన్నవించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అంతేకాక గత నెలలో గోరంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశ వర్కర్ శబరిని వేధిస్తున్న ఎంఎల్‌హెచ్‌పి గౌతమి పై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి మే 23న వినతి పత్రం అందజేసి విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఆశ వర్కర్లపైనే అధికారులు మండిపడుతున్నారని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నో సమస్యలు జరుగుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మంజువాణి స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

రచయితలకు ప్రభుత్వం సహకరించాలి

జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా

ప్రజాశక్తి - సోమందేపల్లి

రచయితలకు ప్రభుత్వం సహకరించాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా రచయితలు పెనుకొండ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రి సవితమ్మను కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రికి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా జాబిలి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నారాయణచార్యులు, పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు లాంటి మహనీయులు జన్మించిన జిల్లా సత్యసాయి జిల్లా అని అన్నారు. ఈ జిల్లాలో దాదాపు 200 మంది రచయితలు ఉన్నారన్నారు.అందులో చాలా మంది రచయితలు ప్రతి ఏటా పుస్తకాలు తమస్వంత ఖర్చులతో ముద్రించి విడుదల చేస్తున్నారని ఆర్థికంగా వెనుకబడిన రచయితలు వాళ్ల పుస్తకాలు ముద్రించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. కావున ప్రభుత్వం తరపున రచయితలను ప్రోత్సహిస్తూ వారి పుస్తకాలు ముద్రించడానికి తగిన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. స్పందించిన మంత్రి జిల్లా రచయితలకు ఈ ప్రభుత్వం తోడుగా ఉంటుందని,సమాజానికి విలువైన సాహిత్యాన్ని రచయితలు తీసుకు రావాలని, బాలసాహిత్యం తో పాటు సామాజిక విలువలతో కూడిన రచనలు చేయాలని, అందుకు తగిన సహకారం అందించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం సభ్యులు భాస్కర్ నాయుడు, శివన్న ,హనుమంతు, ఉమర్ ఫరూక్, అంద్రూస్, అహమ్మద్ హుస్సేన్, అమీర్ వలి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానిస్తున్న రచయితల సంఘం నాయకులు

వేరుశనగ పంట పరిశీలన

గోరంట్ల : మండలంలోని సింగిరెడ్డిపల్లి సమీపాన రైతు సాగు చేసిన వేరుశనగ పంటను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం జాన్సన్, కోఆర్డినేటర్ రామసుబ్బయ్య బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వేరుశనగ పంటకు పచ్చపురుగు ఆశించిందని దీని నివారణకు కెనాల్ పాస్ రెండు మిల్లీమీటర్లు లేదా క్లోరో ఫైల్ పాస్2-5 మిల్లీమీటర్లు కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

ముదిగుబ్బ : మండలకేంద్రానికి చెందిన సాయిఫ్రూట్స్ యజమాని ఇందుకూరి సురేష్ మండలంలోని గుడ్డంపల్లితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం పాఠశాల విద్యార్థులకు పలకలు, లేపాక్షి నోటుపుస్తకాలు , పెన్నులు, పెన్సిల్లు, అట్టలు, బలపాలు, స్టేషనరి వస్తువులు అందజేశారు. దీంతో దాత సురేష్‌కు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫకద్దీన్, నరసింహులు, మునేనాయక్, భాస్కర్ నాయక్, శివ, సాయిలీల, వరలక్ష్మి, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం :మండలంలోని చోలేమర్రి హైస్కూల్ విద్యార్థులకు అదేపంచాయతీ గొబ్బరంపల్లికి చెందిన టిడిపి యువనాయకులు విద్యాసామగ్రి అందజేశారు. గ్రామానికి చెందిన యువ నాయకులు రవి బుధవారం 140మంది విద్యార్థులకు అట్టలు అందజేశారు. అదే విదంగా గొబ్బరం పల్లి ఎంపిపి పాఠశాలలో 30మంది విద్యార్థులకు పలకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, కుళ్లాయప్ప, మారెప్ప, ఆర్. రామలింగప్ప, ఆర్.రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కదిరిగేటు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆర్అండ్‌బి అధికారులు బుధవారం పూడ్చివేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల వల్ల వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను స్థానిక నాయకులు మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వారు గుంతలను తక్షణమే పూడ్చివేసి ప్రజలకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు బుధవారం జేసీబీ సాయంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకున్నారు.

22 నుంచి స్కూల్ క్రికెట్ టోర్నీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గుట్ట కిందపల్లి ఆర్‌డిటి స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో జూలై 22 నుండి స్కూలు క్రికెట్, కబాడీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్రికెట్ కోచ్ రాజశేఖర్, కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసక్తిగల క్రీడాకారులు తమ జట్టు పేర్లను జూలై 20 తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు క్రికెట్ కోచ్ రాజశేఖర్ సెల్ నెంబర్ 9985929285, కబడ్డీ కోచ్ పృథ్వీ సెల్ నెంబర్ 9966492540కు సంప్రదించాలని కోరారు.

కొత్త చట్టాలపై అవగాహన

ధర్మవరం టౌన్ : దేశవ్యాప్తంగా జూలై 1వ తేదీ నుండి అమలు కాబోతున్న కొత్త చట్టాలపై ధర్మవరం డివిజన్ పరిధిలోని పోలీసులకు బుధవారం అవగాహన కల్పించారు. స్థానిక సాయినగర్ శ్రీ షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఈ సదస్సులో డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ కానిస్టేబుల్ స్థాయి నుండి సిఐ స్థాయి వరకు అందరికీ కొత్తచట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ అవగాహన సదస్సులో 6 మంది శిక్షకులు కొత్త చట్టాలపై గల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

హాకీ టోర్నీకి ఆహ్వానం

ధర్మవరం టౌన్ : పట్టణంలో ఈనెల 27 నుంచి జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల ప్రారంభోత్సవానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్‌ను నిర్వాహకులు బుధవారం ఆహ్వానించారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఈనెల 27న నుంచి 30వతేదీ వరకు జరిగే 14వ సీనియర్ పురుషుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభోత్సవానికి రావాలని పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ లను వెంకటాపురానికి వెళ్లి నిర్వాహకులు ఆహ్వానించారు.

టీడీపీలో బీసీలకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

తెలుగుదేశం పార్టీలో బిసిలకు ప్రాధాన్యత లభిస్తుందని మాజీమంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం బీసీ సంక్షేమ, జౌళీ, చేనేత శాఖల మంత్రి సవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరిగేది ఒక్క తెలుగుదేశం పార్టీలోనే అని అన్నారు. సవితకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఇది మరోసారి నిరూపితమైందన్నారు. సవిత రాజకీయాల్లో ఎంతో కష్టపడి పైకొచ్చారని ఆమెకు సముచితమైన స్థానం దక్కిందని అన్నారు. సవిత బీసీలకు, చేనేతలకు న్యాయం చేసే విధంగా పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే

తాగునీటి కోసం ఆందోళన

తాగునీటి సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న మహిళలు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని రెండవ వార్డులో గత పది రోజులుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ వార్డు ప్రజలు బుధవారం స్థానికమున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వార్డులోని మహిళలు, ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతూ ధర్నా చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ రావాలి కమిషనర్ వచ్చి సమాధానం ఇవ్వాలని నినాదాలు చేశారు. పది రోజులుగా మోటర్లు చెడిపోయినందున నీరు కొళాయిలకు రావడం లేదన్నారు. సమస్యను పలుమార్లు మున్సిపల్ చైర్మన్‌కు, అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందన్నారు. రెండవ వార్డుకు చెందిన చైర్మన్ వార్డులోనే నీరు రాకపోతే ఇక ఎవరికి చెప్పుకోవాలన్నారు. వెంటనే మోటర్ మరమ్మతులు చేయించాలని నినాదాలు చేశారు. స్పందించిన కమిషనర్ అంజయ్య వెంటనే మరమ్మతులు చేయిస్తామని తన సిబ్బందితో ఆ వార్డుకు బయలుదేరడంతో ప్రజలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి గంగన్న, నారాయణప్ప, పలువురు మహిళలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : ఆర్డీవో

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి డివిజన్ లోని ఆసుపత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్ కేంద్రాలలో చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా గర్భ విచ్ఛిత్తి కి పాల్పడిన వైద్యులతో పాటు సహకరించిన కుటుంబ సభ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ చట్టం అమలుకు సంబంధించి పుట్టపర్తి డివిజన్ స్థాయి అడ్వైజరి కమిటీ సమావేశాన్ని నిర్వహించి పలు విషయాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ నేరమని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట నిబంధనలు ఉల్లంఘించిన వారికి మొదటి తప్పునకు 5 సంవత్సరాలు వైద్య సేవలు నిలిపివేయబడతాయని పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ప్రతి అడ్వైజరీ సమావేశంలో చర్చించిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, తీర్మాన అంశాలన్నీ క్షేత్రస్థాయిలో అమలు చేసే విధంగా జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్కానింగ్ నిర్వాహకుల కు చట్టంపై అవగాహన కలిగించి లింగ నిర్ధారణ జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అలాగే ఆయా స్కానింగ్ సెంటర్లలో పనిచేసే సిబ్బందికి అంతేకాకుండా ప్రజలకు కూడా లింగ నిర్ధారణ పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ అంశంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా స్కానింగ్ సెంటర్ల లో లింగ నిర్ధారణ జరిగినట్లు రుజువైతే అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. అలాగే జిల్లాలో ఎక్కడ కూడా మాతృమరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. డయేరియా సంక్రమించకుండా చర్యలు తీసుకోవాలని, ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో వున్న స్కానింగ్ సెంటర్ల లైసెన్సులు, రెన్యువల్ కోసం చేసుకున్న దరఖాస్తులు కొత్తగా సెంటర్ల లైసెన్స్ కోసం దరఖాస్తుల వివరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సునీల్ కుమార్, హెల్త్ ఆఫీసర్ వీరమ్మ, దిశ సిఐ విజయలక్ష్మి, రెడ్ క్రాస్ సొసైటీ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో లోపాల గుర్తింపుపై శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారుల్లో లోపాలు గుర్తించేందుకు వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పట్టణంలోని జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి మీటింగ్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ మంజువాణి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల చిన్నారులలో కలిగే పలు లోపాలను గుర్తించేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాల స్వాస్థ్య కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ నివేదిత తెలిపారు, స్థానిక ప్రముఖ చిన్న పిల్లలు వైద్యులు ప్రేమ్ కుమార్, జిల్లా అధికారి కార్యాలయ సిబ్బంది హరి, స్థానిక సిబ్బంది రఘురామ్, డాక్టర్ అపర్ణ,ఆప్తోమెట్రీషియన్ సాయిక్రిష్ణ, సోషియల్ వర్కర్ మోహన్ రెడ్డి, ఎల్‌టి. చందన తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే భవిష్యత్తు

ప్రతిభా విద్యార్థులతో పాంచజన్య శ్రీనివాసులు, ఎంఇఒ, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారు మయం చేస్తుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అన్నారు. పాంచజన్య పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు, పాంచజన్య భారతి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి, ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఆర్థిక ఇబ్బందులు ఉన్న 11 మంది విద్యార్థులకు రూ.10వేల చొప్పున రూ. 1.10లక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఒ గంగప్ప మాట్లాడుతు ప్రవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహకులు కేవలం ధనార్జనే ధ్యేయంగా విద్యాలయాలను స్థాపించే పరిస్థితులు ఉన్నాయన్నారు. అయితే ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవ కోసమే శ్రీనివాసులు విద్యాలయాన్ని స్థాపించి ఎంతో మందికి విద్యాదానం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో మంచి ప్రతిభా కనబర్చిన విద్యార్థులకు వారి ఉన్నత చదువుల కోసం స్కాలర్ షిప్‌ను అందించడం అభినందనీయమన్నారు. పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు శ్రీ సత్యనారాయణ శెట్టి, తాయారమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, లేట్ శ్రీమతి ఎం భాగ్యలక్ష్మి గారి సహకారంతో ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఇంటర్మీడియట్ చదువు కోసం ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అతికా ఖనమ్, నిఖిల్ గౌడ్, గ్రీష్మ, అర్బా కౌసర్, కష్ణ కౌశిక్, ముజస్సీమ్, మహిత, తకియా సభా, జవాద్ ఆలమ్, ముబషిరా, దత్త దీపక్ విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ డిఎస్ నందకుమార్, ఎఒ భాస్కర్, పాఠశాల హెచ్ఎం గాయత్రి, సూపరిండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మవరంలో సమస్యలకు తక్షణ పరిష్కారం

సమస్యలపై నాయకులు, స్థానికులతో చర్చిస్తున్న పరిటాల శ్రీరామ్

పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఈ మేరకు ఆయన అమృత్ పథకంకింద మంజూరై ఇప్పటికి పూర్తికాని ఓవర్‌హెడ్ ట్యాంకును, అన్న క్యాంటీన్ భవనాలను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరంలోని ఎల్1, ఎల్, ఎల్, ఎల్4 లతోపాటు ఇందిరమ్మ, వైఎస్ఆర్ కాలనీతోపాటు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. అమృత్ పథకం కింద మంజూరైన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరగా తాగునీటిని అందించేలా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. ధర్మవరం ప్రజలకు ఎక్కడ కష్టమొచ్చిన త్రిమూర్తుల్లా సత్యకుమార్‌యాదవ్, చిలకంమధుసూదన్‌రెడ్డితో కలిసి పనిచేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎవరైనా సరే నిబంధనలు అతిక్రమించి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు కొనసాగిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్.నరేంద్రచౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, సందారాఘవ, జింకాపురుషోత్తం, నాయకులు భీమనేని ప్రసాద్ నాయుడు, చింతపులుసుపెద్దన్న, నాగూరుస్సేన్, ఫణి కుమార్, రాళ్లపల్లిషరీఫ్, అంబటిసనత్, తలారిచంద్ర, మోహన్ బాబు, కొత్తపేట ఆది, మాదవరెడ్డి, గోసల శ్రీరాములు, కేతినేనిరాజ, బొట్టుకిష్ట, చీమలరామాంజి, జింకల రాజన్న, కేశగాళ్లశీన, బీరేశీన, భాస్కర్ చౌదరి, అడ్ర మహేష్, కత్తుల బాబ్జీ, నాగరాజు, ముత్యాలు, రాజ్‌కుమార్ నాయుడు, మారుతి స్వామి, కొత్తపేట రవి, గంగారపు రవి, రాంపురం శీన, చెలిమి శివరాం, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని డిఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి సూచించారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మంజువాణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ శ్రీదేవి తో కలిసి ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆరోగ్యశ్రీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను, ఆసుపత్రి పని తీరును పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాలు, అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ గురించి విచారించి వ్యాక్సిన్ నిల్వ ఉంచు ఫ్రిడ్జి లను, ల్యాబ్, కాన్పుల గది, వార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమములో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ , స్టాఫ్ నర్స్ అమ్మాజీ, ఆరోగ్యశ్రీ టీం లీడర్లు, ఆరోగ్య మిత్రలు, ఫార్మసిస్ట్ నాగవేణి, ఆరోగ్య కార్య కర్త శివ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : రొద్దం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి మంజువాణి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరును సిహెచ్ఓ విజయలక్ష్మిని అడిగి తెలుసుకొన్నారు. వయోజనుల వ్యాక్సిలేషన్ గురించి ఆరా తీశారు. జూలై 1 నుండి 30 వరకు నిర్వహించే యాంటీ డయేరియా ప్రోగ్రామ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రజియా, అటెండర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మందుల నిల్వను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

అంధకారంలో పుట్టపర్తి ప్రధాన రహదారి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి ప్రధాన రహదారిలో అంధకారం నెలకొంది. పుట్టపర్తి నుంచి వివిధ పట్టణాలకు నగరాలకు వెళ్లే వాహనాలు పాదచారులు, ద్విచక్ర వాహన దారులు వెళ్లే ప్రధాన రహదారి లో వీధి దీపాలు వెలగనందున రాత్రిపూట అంధకారం అలుము కొంటోంది. ఒక ఏడాది నుంచి వీధి దీపాలు పునరుదించకుండా మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఆర్‌వి జానకిరామ్ ఘాట్ నుంచి పెట్రోల్ బంక్ వరకు రాత్రి సమయంలో కారు చీకటి అలుము కొంటోంది. దీంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో హైమాస్క్ లైట్లు వేశారే తప్ప అవి చెడిపోతే తిరిగి లైట్లు వేద్దామన్న ఆలోచన అధికారులకు రాలేదు. ఈ రహదారి మీద ఎప్పుడో సత్య సాయి జన్మదినం రోజున ఆర్భాటంగా వెలుగుతాయే తప్ప ఆ తరువాత చీకటి రాజ్యం ఏలుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తలుపుల : మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి గ్రామ సమీపన నాగల కట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేటకు చెందిన ముత్తూరు రమణ నాయుడు (42) తన చెల్లెలు ఊరు వేములగొంది గ్రామానికి కుటుంబ సమేతంగా వచ్చాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటిలో మాంసాహారం చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా చికెన్ తేవడానికి రమణనాయుడు వేములగొంది పెద్దన్నవారిపల్లి ద్విచక్ర వాహనం బయలుదేరాడు. ఈ నేపథ్యంలో పెద్దన్నవారిపల్లి సమీపాన నాగులకట్ట వద్ద ద్విచక్రవాహం అదుపుతప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రమణనాయుడు మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు పక్కన గుర్తుతెలియని వాహనం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని కోడేకండ్ల గ్రామ సమీపంలో గత 20 రోజులుగా రోడ్డు ప్రక్కన ద్విచక్రవాహనం ఆపి ఉంది. దీని యజమాని ఎవరో తెలియడం లేదని గ్రామస్తులు అంటున్నారు. అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని కోడేకండ్ల గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గత 20 రోజులుగా ఈ వాహనం నిలిపి ఉంచారని గ్రామస్తులు చెపాపరు. ఏదైనా ప్రమాదానికి గురై ఇక్కడే వదిలేసి వెళ్లారా? దొంగతనంగా తెస్తూ వదిలేశారా? లేదంటే మరమ్మత్తుకు గురై వదిలేశారా అనేది తెలియడం లేదన్నారు. ఈ వాహనం ఎవరిదో పోలీసులు ఆరా తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైసిపి నాయకుడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి పి. జనార్దన్ రెడ్డిపై సీనియర్ పాత్రికేయుడు ప్రశాంత్ కుమార్ బుధవారం వన్ టౌన్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పి. జనార్దన్ రెడ్డి సీనియర్ పాత్రికేయుడు ప్రశాంత్ కుమార్‌పై సామాజిక మాధ్యమాలలో అసభ్యకరమైన మెసేజ్‌లను పెట్టి అవమానించారని, దీంతో పాటు తాను పని చేసే సంస్థను కూడా దూషించాడని బాధితుడు ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జనార్దన్ రెడ్డి పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీ సత్యసాయి సేవాసమితి ఔదార్యం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మతిస్థిమితం లేని వ్యక్తిని శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు ఆదరించి తమ ఔదార్యాన్ని చాటారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్లో కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం లేని వ్యక్తి ఉంటున్నాడు. సరైన బట్టలు ధరించక స్నానం చేయక జుట్టు పెంచుకొని తిరుగుతున్న వ్యక్తిని సోమందేపల్లికి చెందిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా బృంద సభ్యులు ఆదరించారు. బుధవారం ఆ వ్యక్తికి జుట్టుని కత్తిరించి స్నానం చేయించి నూతన బట్టలు ధరింపజేశారు. ఈ సందర్భంగా సేవా సభ్యులు మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన ఇతనికి ఇక్కడ ఉన్న హోటల్ యజమానులు ప్రతిపూట భోజనం ఇచ్చేవారని ఇచ్చిన భోజనాన్ని తింటూ అక్కడే ఉండేవాడన్నారు. శ్రీ భగవాన్ సత్యసాయి సేవాసమితి సభ్యులు మతిస్థిమితం లేని వ్యక్తిని ఆదరించడాన్ని చూసి స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవా సమితి కోఆర్డినేటర్ సీతారాములు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, లింగప్ప, శివ, తురకల పట్నం భజన మండలి కన్వీనర్ సదాశివ, నాయి బ్రాహ్మణుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఏపీ జెఎసి సత్యసాయి జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులు మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పెనుకొండలో మంత్రిని కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. జిల్లా రెవిన్యూ అధ్యక్షులు మధు నాయక్, జనరల్ సెక్రటరీ పద్మనాభ రావు, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యాదగిరి చౌడప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు మొయినుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు అశోక్, బాలాజీ, సూర్య కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పితామహుడు సాహు మహరాజ్

ప్రజాశక్తి-హిందూపురం

బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు పోరాటాలు సాగించిన రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం శాఖ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సాహు మహరాజ్ 150వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, బిఎస్‌పి నాయకులు హరికుమార్, చౌళూరు రామాంజనేయులు, సుబ్బరాయప్ప, సత్యానందమూర్తి, సడ్లపల్లి నారాయణప్ప, శ్రీ రంగరాజు పల్లి శ్రీనివాసులు, చిరంజీవి, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మజాతరలో 'పల్లె'

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని అప్పలవాండ్ల పల్లి లో జరిగిన మారెమ్మ గ్రామ జాతరలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, పట్టణ కన్వీనర్ వలిపీ శ్రీనివాసులు, టీడీపి మాజీ సర్పంచి కిష్టప్ప, బైరాపురం సర్పంచి రవికుమార్,టిడిపి నాయకులు కిరణ్ , రామ చంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పండి

చిలమత్తూరు : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ మండల కేంద్రంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన "నేను బడికి పోతా" కార్యక్రమం లో బాగంగా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖ అదికారులు పద్మప్రియ, సల్మాన్ రాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని 40 వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అందరం కలిసి పనిచేసి ప్రజలకు సేవకులుగా నిలుద్దామని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డిశ్రీనివాసులతో కలిసి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో ఎక్కడెక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో చర్చించారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మవరం పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మారుస్తామని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, ఆర్వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామనిఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుండి వైయస్సార్ సర్కిల్ వరకు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కుంచటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం పాండురంగప్ప, గుండుమల రాధాకృష్ణ, గుండుమల చంద్రప్ప, ఐదు మండలాల కన్వీనర్లు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల, తదితరులు